# దేవరహస్యం

చావా శివకోటి

జిల్లా పరిషత్ ఛైర్మన్ రాయప్పగారు మంగలతండాలో ప్రాథమిక పాఠశాల కోసం కట్టబడిన నూతన భవనానికి ప్రారంభోత్సవం చేసేందుకు బయలుదేరారు.

ఇంటి నుంచి స్వంతకారులో బయలుదేరి పరిషత్తు ఆఫీసుకెళ్ళి, అక్కడ నుంచి ప్రభుత్వ వాహనంలో వందిమాగధులతోనూ, ఆ సమితికి సంబంధించిన ఉద్యోగస్తులతోనూ కలిసి వెళ్ళారు.

స్వతంత్రం వచ్చి ఇంతకాలమైనా మంగల తండాలో ఇప్పటిదాకా బడి లేదు. వస్తుత: మంగలతండా నిజంగా ఒక్క తండా కాదు. దాని క్రింద నివారు తండాలు పదకొండు ఉన్నాయి. మొత్తంగా అక్కడ నివసించే జనం లంబాడీలు, నాల్గయిదు వైశ్యుల కొంపలూ-ఓ ఆయుర్వేద వైద్యుడూ, నలుగురు ఇతర కులస్తులు మటుకు వాళ్ళలో కలిసిపోయి, వెనకటి నుంచీ వుంటున్నారు.

ప్రస్తుతం మంగలతండా నాయకుని పేరు కెతావత్ గిస్కా. అనువంశీకంగా ఈ 'గిస్కా', మంగలతండాల సమూహానికి నాయకుడు కాదు. అసలా పెద్దవాళ్ళ కోవలోకి ఎన్నడూ రాలేదు. మరి గిస్కాయే ప్రస్తుతం నాయకుడు అంటున్నాం గదా?

ఎలా అంటే-

చాలామంది పెద్ద నాయకులలాగానే గిస్కా కూడా చిన్నతం నుంచీ పోరంబోకుగా, జులాయిగా తండాలో తిరుగుతుండేవాడు. కాయ కష్టం చేసుకొని బ్రతుకీడ్చే వాళ్ళతో ఇతనెన్నడూ లేడు. గిస్కాకు తండ్రి లేడు. తల్లి ఇతన్ని పదేళ్ళనాడే వదిలేసి మరో మనువాడి కొత్త కాపురానికి వెళ్ళిపోయింది. పోతూ పోతూ ఇతన్ని ఆవిడ తల్లి కప్పగించింది. ఆ తల్లేమో ఏడాది తిరగకుండానే హరీ మంది.


అప్పటి నుంచి-గిస్కాను ఎవ్వరూ అదుపు చెయ్య లేదు. అలనా పాలనా అతనికి దొరకలేదు. రికామీగా బ్రతుకు ప్రారంభించాడు. చేసిన తప్పుడు పనులకు తండావాళ్ళు దెబ్బలు కొట్టారు. తప్పేసారు. అతనిలో మార్పురాదని గమనించి చిట్టచివరకు వాడి ఖర్మ అనుకొని వదిలేసారు. ఈ లోపుబాగా ఊహ తెల్సింది గిస్కాకు. రోజువారీ ఖర్చులూ- అతనితో రికామీగా తిరిగేవాళ్ళకు మామూలు సాదర్లూ ఎలా సర్దుబాటు చేయాలా అని ఆలోచించాడు. ఈ ఆలోచన చేసే రోజులలోనే రోజూ పగలల్లా కాయకష్టంచేసి తండాకు వచ్చే అనేక మంది సారాయి దుకాణంలోకి వెళ్ళి రావడం కనిపించింది. సారాయి వ్యాపారంపైకి ఆలోచనలు మలుపుకున్నాడు. కాంట్రాక్టు చేయడం, బాధ్యత వహించడం, అందుకు కావలసిన పెట్టుబడి సమకూర్చు కొనడం సాధ్యమయ్యేలా అనిపించలేదు. ఆ వెంటనే మరో ఆలోచన మెదిలింది.

'బట్టీలు పెట్టి సారాయి వండితే!?' అని బాగానే వుందనిపించింది. కొద్ది పెట్టుబడితో చిన్న పరిశ్రమగా ప్రారంభించాడు దీన్ని. పదకొండు తండాలకూ రోజు వారీ ఈ రికామీగా తిరిగే మిత్రులే సప్లయి చేసి పైసలు వసూలు చేసుకొని వచ్చే ఏర్పాటు చేసాడు. ఈ పద్ధతి బాగా నచ్చింది.

ఈలోపు 'అడ్డా' పాడిన కాంట్రాక్టరు, సారా అమ్మకం పరిస్థితిలో వచ్చిన మార్పుకు బెంబేలు పడి పోయి తండాకు పరుగెత్తుకుంటూ వచ్చాడు. పరిస్థితి అర్థమైంది.

ఎక్సయిజ్ వారి సాయంతో ఆ మర్నాడు రైడ్ పెట్టించాడు కాంట్రాక్టరు. జులాయిగాళ్ళనంతా వెనక వుంచుకుని కాంట్రాక్టరును బెదరగొట్ట గలిగాడు గిస్కా. ఈ రైడ్‌లో ఇద్దరు ముగ్గురికి దెబ్బలు తగలడం, పోలీసు స్టేషన్లకు వెళ్ళడం వరకూ వచ్చింది పరిస్థితి.

ఈ సందులో దుకాణదార్లను బెదిరించి అమ్మకం జరగకుండా ఆపగలిగాడు గిస్కా. ఇతను చేసిన ఈ పనంతా చేయకూడనిదే! ప్రభుత్వ వ్యతిరేకమయినదే!!




అయినా రౌడీయిజంతో జంకూ గొంకూ లేకుండా చేసాడు. ఓట్లు కావాల్సిన ఓ పార్టీ ఇతని కార్యక్రమాలకు వత్తాసు యిచ్చింది.

ఇలా కొనసాగితే పరిస్థితి మరీ విషమిస్తుందనే భావనతో కాంట్రాక్టరు గిస్కాను సారా డిపోకు పిలి పించి సగౌరవంగా సంప్రతింపులు జరుపుకున్నాడు.

ఎగ్రిమెంటు కుదిరింది ఇద్దరికీ-

మొదటిది-గిస్కాకు రౌడీ మామూలు కింద నెలకు వెయ్యి రూపాయిలు డిపో నుంచి ప్రతి అయిదో తారీకునాడు ఇచ్చేట్టూ, గిస్కా వెంట రికామీగా తిరిగే మనుష్యులలో అయిదుగుర్ని సారా డిపో జవాన్లుగా తీసుకునేట్టూ, వారికి నెలవారీ సారా డిపోలో వున్న వారితో పాటు జీతభత్యాలు ఇచ్చేట్టూ కుదిరింది.

అయితే ఇదంతా స్వంత మేలే కదా. నాల్గయిదు సంవత్సరాలలో విషయం అందరికీ అర్థమయిం తరు వాత, పరిస్థితులు ఎలా మారుతాయో ఏమోనని గిస్కా బాగా ఆలోచించి గ్రామానికి (తండాకి) కూడా సంవత్సరానికి అయిదు వేల రూపాయిలు-(సమిష్టి ఖర్చుల నిమిత్తం) ఇప్పించేందుకు ఒప్పించగలిగాడు కాంట్రాక్టరును. దాంతో కెతావత్ గిస్కాకు 'జులాయి వెధవ' అని తిట్టిన గ్రామ పెద్దల నుంచి మెప్పు లభించింది.

హోలీ పండగకు ఈ డబ్బులో నుంచి కొంత సారాయి తెచ్చి తండాలకు ఉచితంగా పొయ్యడంతో ఆటోమాటిక్‌గా నాయకుడైపోయాడు గిస్కా. అప్పటి దాకా వత్తాసుగా మాటాడుతూ వచ్చిన పార్టీ గిస్కాకు ఓ చిన్న పదవినిచ్చి అతన్ని, తద్వారా అతని ఓటర్లనూ బెసక్కుండా బిగించేసుకుంది.

ప్రస్తుతం ఖేతావత్ గిస్కా ఆధిపత్యంలోనే బడి కట్టుబడి పూర్తయింది. మూడు సంవత్సరాలు తండాలకు వచ్చిన సారాయి పైకంతో బడి పూర్తయింది. కొంత జిల్లా పరిషత్ ఆశీస్సులతో సమితి వారు ఇచ్చారు.

ఛైర్మన్ రాయప్పగారి జీపు సరాసరి బడి దగ్గరకొచ్చి ఆగింది. ఆయన జీపు దిగుతుండగానే గిస్కా పూల మాలతో ఎదురయి ఆహ్వానించాడు. ఈ ప్రారంభోత్స వాల తంతు అక్కడి జనానికి కొత్త కనుక చూసేందుకు తండాలన్ని ఆ బడి దగ్గర పోగయ్యాయి.

అనుకున్న టైం కంటే పది నిమిషాలు ముందే వచ్చారు రాయప్ప గారు. అందునా మరో అయిదు ప్రారంభోత్సవాలను పూర్తిచేసి "ఠంచన్‌గా చాలా పక డ్బందీగా కార్యక్రమాల్ని అనుకున్న టైంలో పూర్తి చేయడం రాయప్పగారి ప్రతిభ" అంటారు చాలా మంది. నిజంగా ఆయన పూర్తి చేస్తూ వచ్చే కార్య క్రమాల్ని చూస్తే ఆ మాట నిజమేననిపిస్తుంది.

రాయప్పగారు స్టేజీ దగ్గరికి రాగానే కొత్తగా వచ్చిన పంతుళ్లూ, తండాల వాళ్లూ, ఓ పరిగెల దండలు వేశారు. మెడలోని దండల్ని తీసి టేబులుపై వుంచి మైకు చేతిలోకి తీసుకున్నాడు.

“సోదరులారా!” అనడంతో జనం నిశ్శబ్దమై పోయారు.

“మీ అందర్నీ ఇక్కడ ఇలా సూడ్డం నాకు సాలా సంతోషంగా వుంది. ఇట్టాంటి తండాలలో కూడా చదువుపట్ల ఆసక్తి కనిపించడం వుందే అది మార్పుకు గుర్తు! మనకు స్వతంత్రం వచ్చి నిజంగా ముప్పయి అయిదేళ్ళు దాటింది. నేను జిల్లా పరిషత్‌కు ఎన్నికయి



బొమ్మ : చిదంబరం

రెండంటే రెండేళ్లయింది. దేశానికి స్వతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళయినా మన పిల్లలకు బళ్లు లేవు. నేనొచ్చి రెండేళ్లే అయినా ఎన్నో బళ్లు పెట్టిచ్చిన. ఇంకా పెట్టిస్తన్న. చదువుంటేనే తెలివి తేటలొస్తయి. తెలివి తేటలుంటేనే బ్రతుక్కు మార్గం దొరకుతుంది. అందుకే మనోళ్ల మంచిగా బతికేందుకు మార్గం చూపులొయ్యనే ఉద్దేశ్యంతోనే ఈ బళ్లు పెడుతూ పోతున్న” ఈ మాటల్లో జనానికి ఏమర్థమైందో ఏమోగాని బాగా చప్పట్లు కొట్టారు. ‘అసలు నేనేం చెప్పాను?’ అని విస్తుపోయిన రాయప్పగారు ఏదో గొప్ప విషయమే చెప్పి వుంటానను కొని ఆ వేశాన్ని పెంచుకొని “ఇప్పటికి ఊరూరా బళ్లు పెట్టించిన. ఇకనేమండే రెండేళ్లలో ప్రతి తండాలోనూ బళ్లు పెట్టిస్త! అయితే నా ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా నడవాలంటే మన గిస్యాగారి లాంటి వారి సహకారం, అండదండలు అవసరం. అవి వారి నుంచి నాకెప్పుడూ వుంటాయనే ఆశతో, నమ్మకంతో, నా కార్యక్రమాల్ని జయప్రదంగా, నిర్విఘ్నంగా పూర్తిచేస్తానని ఆశిస్తూ ముగిస్తున్నా” అన్నాడు చెమటలు తుడుచుకుని కుర్చీ వైపుగా జరుగుతు.

సభ ముగిసింది.

తేనేటి విందూ ముగిసింది.

విందుకు ససేమి ఆగనన్నాడు.

జీపు దగ్గరకు బయలుదేరాడు.

ఇంతలో రాయప్పగారి గ్రామ శివారు తండా నాయకుడొకడు “దండం దొర” అనడం వినిపించి వెనక్కి తిరిగి “ఏం మంగ్యా! ఎప్పుడొచ్చావు?” అని పరామర్శించాడు.

“మా అప్పదీ వూరే దొర” అన్నాడు.

“ఉంటున్నావా” అనడిగాడు రాయప్ప.

“ఈ పూటే వస్తిని. రేపుండనత్త. గయితే దొర! ఇన్నూళ్లలో బళ్లెడతన్నారు, మనూళ్లో పెట్టరేంది?” అన్నాడు అమాయకంగా మంగ్యా.

“ఈ ఏడు పెడదాం” అన్నాడు రాయప్ప కారెక్కుతూ.

చైర్మన్‌గారి మాటలకు ఆశ్చర్యపోయిన గిస్యా, కారు దగ్గరగా వెళ్లి గుసగుసగా “ఏందది?” అన్నాడు మంగ్యా వైపు చూపిస్తూ. చైర్మన్ రాయప్పగారు చిద్విలాసంగా నవ్వి “ఇదిగో గిస్యా నీకు నాకూ తేడా వుందోయ్” అని ఓ క్షణం ఆగి “ఈడ నువ్వు కర్ర పుచ్చుకొని అంతా అదుపుచేసుకోగలవు. చదువు ఇక్కడ నిన్నేమి చెయ్యలేదు. నేను అహింసావాదిని. కర్ర పట్టుకోవడం నా తత్వానికి విరుద్ధం. కనుక నాకాడ చదువు వద్దు” అన్నాడు.

అర్థం కాక చూశాడు గిస్యా తెల్లబోతూ.

“అర్థం కాలేదా? బడి వుంటే అక్షరాలొస్తయి. అక్షరాలు తెలివి తేటల్నిస్తయి. తెలివి వుంటే ఈ జనం మన చేతిలో వుండరు. అందుకే నాకాడ బడి వుండదు. నీ దగ్గరంటావా ఈ బడి నిన్నేం చెయ్యలేదు. వుంటా” అని చేయి వూపాడు.

జీపు కదిలింది. దుమ్ము రేపుకుంటూ వెళ్లిపోయింది.

దేవర రహస్యం అర్థమైంది.

అర్థమైంతరువాత నిజంగా పిచ్చెత్తినట్టయింది.

ఇంటి వైపుగా నడుస్తూ ‘వచ్చిన స్వతంత్రానికి ఎన్నేళ్ళొస్తే ఏమవుతుంది?’ అనుకున్నాడు నవ్వునాపుకుంటూ.

“విద్య వివేకాన్నిస్తుంది. వివేకం విజ్ఞతను నేర్పుతుంది. విజ్ఞత న్యాయాన్ని నిలుపుతుంది” అని చెపుతున్నాడు బడిపంతులు.